తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
06-10-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 238
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్ల తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## బకాయిల భారంతో
# ఖజానాపై ఒత్తిడి

- కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు రూ.51 వేల కోట్లకుపైగా బకాయిలు
- ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన మొత్తం రూ.14 వేల కోట్లకు చేరిక
- డీఏ, రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం ఎదురుచూపులు
- జీతాలు, పెన్షన్లు, రుణాల వడ్డీలతో పెరుగుతున్న వ్యయం
- సంక్షేమం, అభివృద్ధి పనులతో సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాలు



**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 5:** తెలంగాణ ప్రభుత్వ ఖజానాపై బకాయిల భారం పెరుగుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గత ప్రభుత్వం నుంచి సుమారు రూ.40,154 కోట్ల బకాయిలు వారసత్వంగా వచ్చాయి. వాటిలో కొంత మొత్తాన్ని చెల్లించినప్పటికీ.. కొత్తగా పేరుకుపోతున్న బిల్లులతో పెండింగ్ మొత్తం తగ్గడం లేదు. కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రస్తుతం రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం.కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులపై ప్రభావం పడుతోంది. పనులు పూర్తి చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు వడ్డీల భారాన్ని మోయాల్సి వస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు కూడా బిల్లుల కోసం ఆందోళన చేస్తున్నారు. దీంతో కొత్త పనులకు టెండర్లు పిలవడం, పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం కూడా ఇబ్బందిగా మారుతోంది. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. 2026 ఏప్రిల్ నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.14 వేల కోట్లుగా ఉన్నాయి. ఇందులో ఉద్యోగుల బకాయిలు రూ.6 వేల కోట్లు,

మిగతా 2వ పేజీలో..

## సమస్య ఎక్కడుంటే
# కరెంటు పెద్దసారు అక్కడ!



## మిన్పూర్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపంపై క్షేత్రస్థాయిలో విచారణ

- సమస్య పరిష్కారమైనప్పటికీ ట్రిప్పింగ్‌కు గల కారణాలను అధికారులతో సమీక్ష
- పంట పొలాల్లోకి నేరుగా వెళ్లి రైతులను విద్యుత్ సరఫరా తీరుపై అడిగి తెలుసుకున్న సీఎండీ
- ఎలాంటి ఫిర్యాదులు లేకపోవడం పట్ల హర్షం..
- క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యుత్ శాఖ పనితీరుకు మంచి మైలేజ్
- సీఎండీ మార్క్ పారదర్శక పాలనతో నాణ్యమైన విద్యుత్

సమస్య ఎక్కడుంటే.. పెద్దసారు అక్కడే ఉంటున్నారు! కేవలం కార్యాలయలకే పరిమితం కాకుండా నేరుగా క్షేత్ర స్థాయిలోకి వెళ్తూ, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, ప్రజల సమస్యలపై స్వయంగా ఆరా తీస్తున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పనితీరు విద్యుత్ శాఖలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతోంది. తాజాగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని మిన్పూర్ సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యపై ఆయన స్పందించిన తీరు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 5 (సిరి న్యూస్):** మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ 230/132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఊహించని విధంగా సాంకేతిక లోపం తలెత్తింది. 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఆన్ లోడ్ ట్యాప్ ఛేంజర్ స్ట్రక్ కావడంతో, ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో సుమారు 50 శాతం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం పంటలు పొట్టదశలో ఉన్న కీలక తరుణం కావడంతో.. విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. రూరల్

మిగతా 2వ పేజీలో..



# మెహదీపట్నంలో ఏసీబీ దాడి..

- రూ.4 లక్షల లంచం పట్టివేత
- రూ.8 లక్షలు డిమాండ్.. రూ.6.5 లక్షలకు ఒప్పందం
- తొలి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- సోదాల్లో మరో రూ.2.5 లక్షల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం
- నిందితురాలిని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలింపు

3

## అక్రమ సంబంధంపై ప్రశ్నించిందని..
# భార్యను కారు బోనెట్‌పై ఈడ్చుకెళ్లిన భర్త!

- వేలాడుతూనే 100 మీటర్లు..
- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌లో కలకలం రేపిన ఘటన
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దృశ్యాలు

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 5 (సిరి న్యూస్):** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ జిల్లాలో అత్యంత అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధాన్ని ప్రశ్నిందనే కోపంతో కన్న భార్య ప్రాణాలకే ముప్పు తలపెట్టేలా ప్రవర్తించిన ఒక భర్త దుశ్చర్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భార్య కారు బోనెట్‌పై వేలాడుతున్నప్పటికీ కనికరం లేకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చి, సుమారు 100 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీరట్ పరిధిలోని లోహియానగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మయాంక్ అనే వ్యక్తి మరో మహిళతో కలిసి కారులో ఉండగా..

మిగతా 2వ పేజీలో..





# కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

- చింతన్ శివిర్‌లో గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక భేటీ
- ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయాలి
- ఎన్‌హెచ్ 65 6+2 లేన్ల విస్తరణ, ఆర్ఆర్ఆర్, హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేపై చర్చ
- పర్వతమాల కింద 5 రోప్‌వేలు, సీఆర్ఐఎఫ్ కింద 33 పనులు
- 3 ఆర్వోబీ/ఆర్‌యూబీలకు మంజూరు కోరిన మంత్రి
- హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యేక విజ్ఞప్తి

**గుజరాత్(ఏక్తానగర్), అక్టోబర్ 5 :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రాపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్ 2026 రెండు రోజుల కార్యక్రమాన్ని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ

మిగతా 3వ పేజీలో..



# టీజీఎస్పీడీసీఎల్‌లో అవగాహన సదస్సు!

- హైదరాబాద్ సీపీటీఐలో ప్రత్యేక వర్క్‌షాప్
- టెలికమ్యూనికేషన్ నిబంధనలపై అధికారులకు స్పష్టత

2

## నిత్యావసర ధరలపై
# నియంత్రణ ఏదీ?



- ఆకాశాన్ని అంటుతున్న సన్న బియ్యం ధరలు
- రేవంత్ సర్కార్ నేల చూపులు : మాజీ మంత్రి హరీష్‌రావు

2

## తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అద్వైత్ కుమార్

- అదనపు బాధ్యతల స్వీకరణ

2



# రెండు నెలల్లో సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే ఆమరణ దీక్ష చేస్తా : కవిత
- హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకుల సింగరేణి భవన్ ముట్టడి

2

## మైనింగ్‌తో రామప్పకు
# ముప్పు అవాస్తవం

- సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై ముందుకు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

3

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడివేడిగా విచారణ

**హైదారాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 5 :**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్టు చేయడంతోపాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# నిత్యావసర ధరలపై నియంత్రణ ఏదీ?

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 5 :**

నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణమని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీలో పార్టీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. సన్న బియ్యం ధరలు నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో చెప్పాలని నిలదీశారు. మీరు అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం సఫలమైతే ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయని ఆయన అడిగారు. మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్న బియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటని వ్యాఖ్యానించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్మెస్పీ పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధరేనని, కానీ దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000పై మాటేనని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం దళారులేనని అన్నారు. కళ్ళముందే ఈ తతంగం జరుగుతుంటే ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదన్నారు. బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165లకు అడ్డగోలుగా ధరలు పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలన్నారు. వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ధరల పర్యవేక్షణ గాలికి పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి అని హితవు పలికారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘా నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న బియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి సామాన్యుడిపై పడుతున్న భారం నుండి ఉపశమనం కల్పించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# ఉగ్రదాడి భయంతో

## ఫెయిర్‌ఫోర్డ్ వీడిన బీ1 బాంబర్లు

**అంతర్జాతీయ బ్యూరో:**

బ్రిటన్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరంపై వారం క్రితం ఉగ్రదాడి కుట్రను గుర్తించి పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులకు లాంచ్ ప్యాడ్‌లా పని చేస్తోన్న ఆ స్థావరంపై మళ్లీ దాడులు జరుగుతాయనే భయంతో అమెరికా అప్రమత్తమైంది. ఫెయిర్‌ఫోర్డ్‌లోని రాయల్ ఎయిర్ ఫోర్స్ స్థావరం నుంచి తమ బీ1 బాంబర్ల ను తిరిగి యూఎస్‌లోని స్థావరాలకు తరలించింది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు ధ్రువీకరించారు. అయితే ఉగ్రదాడి భయంతో వాటిని తరలించారా..? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. సాధారణంగా బాంబర్లకు ఏదైనా ముప్పు పొంచి ఉందని భావిస్తే.. వాటిని యూకేలోని మరో ప్రాంతానికి తరలిస్తారని నిపుణులు పేర్కొన్నారు. అలా కాకుండా ఏకంగా అమెరికాకు తరలించడం అసాధారణమన్నారు.

# అక్రమ సంబంధంపై ప్రశ్నించిందని.. భార్యను కారు బోనెట్‌పై ఈడ్చుకెళ్లిన భర్త!

మొదటిపేజీ తరువాయి

అతడి భార్య సునీత అనుకోకుండా ఆ ప్రాంతానికి చేరుకుంది. భర్త ప్రవర్తనపై అనుమానం వచ్చి వారిని నిలదీయడంతో వివాదం ప్రారంభమైంది. పరిస్థితి తీవ్రం కావడంతో భర్త మయాంక్ అక్కడి నుంచి కారులో పరారయ్యేందుకు ప్రయత్నించాడు. కారును కదిలించవద్దని భార్య సునీత అడ్డుగా వెళ్లినా భర్త పట్టించుకోకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు ఆమె ఒక్కసారిగా కారు బోనెట్‌ను గట్టిగా పట్టుకుని వేలాడాల్సి వచ్చింది. బోనెట్‌పై సునీత వేలాడుతున్నప్పటికీ భర్త కారును ఆపకుండా అలాగే సుమారు 100 మీటర్ల దూరం ముందుకు పోనిచ్చాడు. ఈ సమయంలో ఆమె భయంతో ప్రాణభయంతో సహాయం కోసం గట్టిగా కేకలు వేసింది. బాధితురాలి ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే అప్రమత్తమై రోడ్డుపైకి వచ్చి ఆ కారును అడ్డుకున్నారు. అనంతరం ఆమెను సురక్షితంగా కిందకు దించి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటనపై బాధితురాలు సునీత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మరో మహిళతో తిరుగుతూ, అక్రమ సంబంధం గురించి అడిగినందుకు తనను కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించాడని ఆమె ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడు మయాంక్‌తో పాటు అతడితో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. సంఘటనకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సమస్య ఎక్కడుంటే కరెంటు పెద్దసారు అక్కడ!

మొదటిపేజీ తరువాయి

జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పర్యవేక్షణలో రంగంలోకి దిగిన సిబ్బంది.. వ్యవసాయానికి కొంతమేర త్రీఫేస్ విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి, కేవలం మూడు గంటల వ్యవధిలోనే సమస్యను విజయవంతంగా పరిష్కరించారు. రాత్రి వేళలో త్రీఫేస్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.





**రంగంలోకి దిగిన సీఎండీ**

సమస్య మూడు గంటల్లోనే పరిష్కారమైనప్పటికీ.. అసలు 230/132 కేవీ స్థాయిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడానికి గల అసలు కారణాలపై ఆరా తీసేందుకు సాక్షాత్తు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ సోమవారం స్వయంగా మిన్పూర్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ట్రిప్పింగ్ ఘటనపై వివరాలు సేకరించారు. ఇలాంటి సాంకేతిక సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి..**

సబ్‌స్టేషన్ పరిశీలనతో సరిపెట్టని సీఎండీ జితేష్ వి. పాటిల్.. అక్కడితో ఆగకుండా మెదక్ జిల్లాలోని కొల్చారం,కౌడిపల్లి మండలాల్లో నేరుగా పంట పొలాల బాట పట్టారు. పొలాల్లో పనిచేస్తున్న రైతుల దగ్గరకు నడుచుకుంటూ వెళ్లి.. ప్రస్తుతం ఇస్తున్న విద్యుత్ సరఫరా తీరు ఎలా ఉంది? ఏమైనా కోతలు ఉంటున్నాయా? అని ఆరా తీశారు. సీఎండీయే స్వయంగా పొలాల వద్దకు వచ్చి తమను పలకరించడం, కరెంట్ సరఫరా గురించి అడగడం చూసి రైతులు ఒకింత ఆశ్చర్యపోయినా, ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న సాగు పరిస్థితులపై అధికారులకు ఎలాంటి ఫిర్యాదులు లేవని, నిరంతరాయంగా కరెంట్ అందుతోందని రైతులు చెప్పడం గమనార్హం.

**సీఎండీ మార్క్ పాలన.. ఉద్యోగులు, ప్రజల్లో ప్రశంసలు**

జితేష్ వి. పాటిల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యుత్ రంగంలో తెచ్చిన సంస్కరణలు, తీసుకుంటున్న ముందస్తు చర్యలు వినియోగదారులకు ఎంతో మేలు చేస్తున్నాయి. ఒకవైపు వేసవి కాలం లేదా ప్రస్తుత డిమాండ్ సమయాల్లో తలెత్తే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు గ్రేటర్‌తో పాటు అవసరమైన అన్ని ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయించడంలో ఆయన సఫలమయ్యారు. హైడ్రోజన్, కోల్ జనరేషన్ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ.. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సమన్వయం చేస్తూ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం ఆయన ప్రణాళికాబద్ధమైన పాలనకు నిదర్శనం. సమస్య ఉందని తెలిసిన వెంటనే స్పందించి, నేరుగా ప్రజల వద్దకే వెళ్లి వాస్తవాలు తెలుసుకునే నిజాయితీ గల అధికారి ఉంటే ఏ విపత్కర పరిస్థితినైనా ఇట్టే ఎదుర్కోవచ్చని టీజీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సీఎండీ జితేష్ వి. పాటిల్ చేపట్టిన ఈ క్షేత్రస్థాయి పర్యటన విద్యుత్ శాఖ పనితీరుకు మరింత వన్నె తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు.

# టీజీఎస్పీడీసీఎల్‌లో అవగాహన సదస్సు!

- తవ్వకాలకు ముందు తప్పనిసరిగా 'కాల్ బిఫోర్ యు డిగ్' యాప్‌ను ఉపయోగించాలని సూచన

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**



టెలికమ్యూనికేషన్ యాక్ట్2023 మరియు టెలికమ్యూనికేషన్ రైట్ ఆఫ్ వే నిబంధనలు2024 అమలుకు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ జారీ చేసిన జీవో, ఇంధన శాఖ జారీ చేసిన జీవో మార్గదర్శకాలపై టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని కళ్యాణ్‌నగర్ సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. టెలికమ్యూనికేషన్ మౌలిక సదుపాయాల రక్షణ, భూగర్భ యుటిలిటీల భద్రత మరియు తవ్వకాల పనుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్) ఎం. ప్రతిమ శోమ్ ముఖ్య అతిథిగా పాల్గొని టెలికమ్యూనికేషన్ చట్టాలు, రైట్ ఆఫ్ వే నిబంధనలు, విద్యుత్ సంస్థలు క్షేత్రస్థాయిలో పాటించాల్సిన విధివిధానాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టర్లందరూ 'కాల్ బిఫోర్ యు డిగ్' మొబైల్ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. భూగర్భంలో కేబుల్స్ లేదా ఇతర తవ్వకాల పనులు చేపట్టే ముందు ఈ యాప్ ద్వారా ముందస్తు సమాచారం తీసుకోవాలని తెలిపారు. దీనివల్ల భూగర్భ టెలికమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం జరగకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. టెలికమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలకు ఎవరైనా నష్టం కలిగించిన పక్షంలో చట్టప్రకారం రూ. 2 కోట్ల వరకు జరిమానా లేదా 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు తీవ్రంగా హెచ్చరించారు. విద్యుత్ సంస్థల అధికారులు, కాంట్రాక్టర్లు మరియు ఫీల్డ్ సిబ్బంది ఈ కొత్త చట్టాలు, రైట్ ఆఫ్ వే నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో మాస్టర్ ప్లాన్, కన్‌స్ట్రక్షన్, లైన్స్ డివిజనల్ ఇంజనీర్లు, వివిధ సర్కిళ్లు మరియు జోన్ల టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, సీబీయూడీ అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బకాయిల భారంతో ఖజానాపై ఒత్తిడి

మొదటిపేజీ తరువాయి

రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించినవి రూ.8 వేల కోట్లుగా ఉన్నాయి. అనంతరం రూ.1,000 కోట్లు విడుదల చేసినట్లు సమాచారం.డీఏ బకాయిలు కూడా ఉద్యోగులకు భారంగా మారాయి. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏ వాయిదాల్లో కనీసం మూడింటినైనా విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బకాయిలను త్వరగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి.భారీగా పెరుగుతున్న జీతాలు, పెన్షన్లు, రుణాలపై వడ్డీ చెల్లింపులు ఖజానాపై అదనపు ఒత్తిడిని పెంచుతున్నాయి. 202627 బడ్జెట్‌లో పెన్షన్ల కోసం రూ.14,737 కోట్లు, రుణాలపై వడ్డీల చెల్లింపులకు రూ.21,304 కోట్లు కేటాయించారు. మరోవైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చాల్సి ఉండటంతో వ్యయాల మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. పన్నుల ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులు అంచనాలకు తగ్గడం, రుణాల అసలువడ్డీ చెల్లింపుల భారం పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తూనే కొత్త వ్యయాలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. పెండింగ్ బిల్లులను క్రమబద్ధంగా పరిష్కరించడం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో కీలకంగా మారింది.

# తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అద్వైత్ కుమార్

**న్యూఢిల్లీ, సిరి న్యూస్ , అక్టోబర్ 5 :**



తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం స్వీకరించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో కో ఆర్డినేషన్ (కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు అండ్ కేంద్ర ప్రాయోజిత పథకాలు) ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ పదవికి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నెం.1441, సాధారణ పరిపాలన శాఖ ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

# రెండు నెలల్లో సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 5 :**



రెండు నెలల్లోగా సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన(టీఆరఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయడంతోపాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. గంటకుపైగా రోడ్డుపై బైఠాయించారు. సింగరేణి యాజమాన్యం తమతో చర్చలు జరిపే వరకు అక్కడినుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి అధికారులు వచ్చి కవిత, హెచ్ఎంఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీ అండ్ ఎండీ సెక్రటేరియట్‌లో సమావేశంలో ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని, లేదంటే సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించారు. కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవటం లేదని విమర్శిం చారు. మూడు నెలల క్రితం తాము ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు పెట్టారని, కానీ దానికి దరఖాస్తు చేసుకున్న వారిలో 10 శాతం మందిని మాత్రమే అన్‌ఫిట్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత దరఖాస్తు చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు మీరు వేసే బిచ్చం కాదు.. అది కార్మికుల హక్కు అని అన్నారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇలా వేధింపులతో ఉద్యోగాల నుంచి తొలగించిన వాళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదన్నారు. అలాంటి సింగరేణి కార్మికుల సంక్షేమానికి టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తాయన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టడంతోనే సంస్థ ఇబ్బందుల్లో ఉందన్నారు. వెంటనే ఆ బకాయిలు చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి ద్రోహుల చేతిలో ఉంది**

**– రియాజ్ అహ్మద్**

సింగరేణి సంస్థ ద్రోహుల చేతిలో బందీ అయ్యిందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన సింగరేణిని మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మార్చేశారన్నారు. ఇకనైనా యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సహా కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి ద్వారా నిర్వహించాలని, నైనీ బ్లాక్‌లో కూడా సింగరేణి నుంచి కార్మికులను నియమించాలన్నారు.

# మెహదీపట్నంలో ఏసీబీ దాడి..

- రూ.4 లక్షల లంచం పట్టివేత
- రూ.8 లక్షలు డిమాండ్.. రూ.6.5 లక్షలకు ఒప్పందం
- తొలి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- సోదాల్లో మరో రూ.2.5 లక్షల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం
- నిందితురాలిని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలింపు

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 5:**





హైదరాబాద్ మెహదీపట్నంలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గోల్కొండ జోన్ సర్కిల్33 (మెహదీపట్నం) కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తులసిరామ్ సునీత ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా సిటీ రేంజ్1 ఏసీబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన 'స్పీకింగ్ ఆర్డర్స్'ను పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించేందుకు అనుమతించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండేందుకు సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. చివరకు రూ.6.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఇందులో తొలి విడతగా రూ.4 లక్షలు కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని మరో రూ.2.5 లక్షల నగదును గుర్తించి సీజ్ చేశారు.

**అవినీతి నిరోధక చట్టం కింద కేసు**

అధికారిక విధులను దుర్వినియోగం చేసి అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన ఆరోపణలపై సునీతపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి భద్రత, గోప్యత దృష్ట్యా ఆయన వివరాలను వెల్లడించలేదు. విచారణ అనంతరం నిందితురాలు సునీతను నాంపల్లిలోని ప్రత్యేక న్యాయమూర్తి (ఎస్పీఈ, ఏసీబీ) కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ అధికారుల అవినీతికి సంబంధించి ఎవరైనా నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- దసరా కానుకగా మహిళలకు చీరల పంపిణీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**ఖమ్మం, సిరి న్యూస్ , అక్టోబర్ 5:**



రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలన్నారు. ఇళ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డివిజన్ లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, పార్కులు, రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్ల వంటి మౌలిక వసతుల పనులను వెంటనే మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పేదరికం నుండి శాశ్వ త విముక్తి పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని మంత్రి అన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి సహకారంతో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు వెచ్చించి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందన్నారు. నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలు, ప్రశాంతతతో జీవించాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే దసరా పండుగ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి కానుకగా చిలకపచ్చ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ హన్మం తరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మైనింగ్‌తో రామప్పకు ముప్పు అవాస్తవం

**సింగరేణి భవన్, సిరి న్యూస్, అక్టోబరు 5 :**

ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో చేపట్ట తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బాధ్యతాయుతమైన రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న సింగరేణి రాష్ట్రానికి చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.

# కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు సమావేశంలో పలు రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి వివిధ అంశాలపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల మంజూరీలు, జాతీయ రహదారుల అభివృద్ధి అంశాలపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, సేతు బంధన్, సీఆర్‌యూఐఎఫ్ పనులకు కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణఏపీ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతోపాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని గడ్కరీని కోరారు.

**ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోరారు. ఇప్పటికే ఎన్‌హెచ్65లో ఎల్‌బీనగర్‌మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లు సహా ఆరు(6+2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆరఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. మియాపూర్‌ఎల్‌బీనగర్ మెట్రో రైలు రెండో దశ కారిడార్‌ను హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్రం నిర్ణయించిన నేపథ్యంలో మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 202627 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని కోరారు.

**పర్వతమాల కింద 5 రోప్‌వే ప్రాజెక్టులు**

పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనాతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జున సాగర్‌నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవి భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని వివరించారు.

**మూడు కీలక ఆర్వోబీ, ఆర్‌యూబీలకు మంజూరు**

202627కు సేతు బంధన్ పథకం కింద మూడు కీలక ఆర్వోబీ/ఆర్‌యూబీ ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ వద్ద నాలుగు లేన్ల ఆర్వోబీ, పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ వద్ద రెండు లేన్ల ఆర్వోబీ, నల్గొండ జిల్లాలో పగిడిపల్లినడికుడి రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల ఆర్వోబీ నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎన్‌హెచ్-65 ఆరు లేన్ల విస్తరణకు వేగంగా ఆమోదాలు**

తెలంగాణఏపీ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్‌విజయవాడమచిలీపట్నం ఎన్‌హెచ్ 65ను ఆరు(6G2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ 1.20 లక్షలకు పైగా పీసీయ□కు చేరిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారిని విస్తరించడంతోపాటు రోడ్డు భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ ఆమోదం, పీఏటీఎస్‌సీ, పీపీపీఏసీ ఆమోదాలు ఇప్పటికే లభించాయని, సీసీఈఏ ఆమోదం కోసం సిఫారసు చేసిన నేపథ్యంలో త్వరగా తుది ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్‌శ్రీశైలం ఎన్‌హెచ్ 765లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్‌కు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని, శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతోపాటు నల్లమల అటవీ ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.

**33 పనులకు రూ.1,227.75 కోట్ల మంజూరు కోరిన మంత్రి**

202627 ఆర్థిక సంవత్సరానికి సీఆర్‌ఐఎఫ్ పథకం కింద రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరారు. మొత్తం 511.68 కి.మీ పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 202627 సీఆర్‌ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని గడ్కరీని కోరారు.

**ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఆర్థిక, కేబినెట్ ఆమోదం తెలపాలి**

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) లోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి కోరారు. సంగారెడ్డినర్సాపూర్‌తూప్రాన్‌గజ్వేల్ జగదేవ్‌పూర్‌భువనగిరిచౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ మేర నిర్మించనున్న ఆరఆరఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్రం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్‌హెచ్ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతులకు దక్షిణ ఆర్ఆర్ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు.

**హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే**

తెలంగాణ, ఏపీల మధ్య భవిష్యత్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. దీన్ని తెలంగాణలోని డ్రైపోర్టుతో అనుసంధానం చేయడం ద్వారా సరకు రవాణా సులభతరం అవుతుందని, ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బందర్ పోర్టుకు స్పర్ కనెక్టివిటీ కల్పించే అవకాశం కూడా ఉందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులన్నింటినీ సానుకూలంగా పరిశీలించి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు, కేబినెట్ ఆమోదాలను త్వరితగతిన పూర్తి చేసి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. మంత్రి వెంట ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, చీఫ్ ఇంజనీర్లు బి.వి. రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, పలువురు అధికారులు ఉన్నారు.

# స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించాలి

- రబీ కార్యాచరణపై వ్యవసాయ కమిషనర్ వీసీ

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 5 :**



ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయంగా, తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలతోపాటు అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. రబీ(యాసంగి) 202627 కార్యాచరణ ప్రణాళికపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాల వారీగా యాసంగి సీజన్‌కు సంబంధించిన సమీక్షా సమావేశాలు నిర్వహించాలని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను క్రోడీకరించి రబీ కార్యాచరణ□ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, అనువైన విత్తన రకాలు, పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. కాగా, వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌కు సరిపడ ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వల స్థితిగతులపై సమీక్షించి రాబోయే సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి, ఉద్యాన శాఖ సంచాలకురాలు డాక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు. వీరితోపాటు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, ఇక్రిశాట్, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ(క్రిడా), భారత వాతావరణ శాఖ, భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్), భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్), భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ(ఐఐఓఆర్), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయాల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



# 21న పోలీసు అమరుల సంస్మరణ సభ

- గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన డిజిపి
- సభా వేదిక, రాకపోకలు, పార్కింగ్ పై సమీక్ష

**హైదరాబాద్, సిరి న్యూస్**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని డిజిపి సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. అక్టోబరు 21న గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించి సోమవారం స్టేడియాన్ని పరిశీలించిన ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. సభావేదిక నిర్మా ణం, ప్రముఖుల రాకపోకలు, ప్రవేశ, నిష్క్ర మణ మార్గాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు.

**నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి**

స్టేడియంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని డిజిపి సమీక్షించారు. 48 గుర్రాలకు వసతి కల్పించే ఆధునిక అశ్వశాల సముదాయం, పోలీసు జాగిలాల కెన్నెల్స్, ఐదు అంతస్తుల సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) భవనం, క్రీడా మైదానాలు, అథ్లెటిక్స్ సదుపాయాల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో జాప్యం చేయొద్దన్నారు. అధికారులు, ఇంజనీర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరారు.



# గురుకులంలో ఎలుకల కలకలం

**గూడూరు, సిరి న్యూస్ ,అక్టోబర్ 5:**

గూడూరు సమీపంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మరోసారి ఎలుకలు కలకలం సృష్టించాయి. మరో విద్యార్థినిని ఎలుకలు కొరికి గాయం చేయడంతో మిగతా విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందారు. పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు కొరకడంతో కాలు కింది భాగంలోని గాయమైంది. విషయం తెలుసుకున్న తహసిల్దార్ నాగభవాని పాఠశాలకు చేరుకొని విద్యార్థినితో మాట్లాడి ఆరా తీశారు. వెంటనే ఆమెను వైద్య పరీక్షల కోసం హాస్పిటల్ కు తరలించారు. నెల రోజుల క్రితం ఇదే పాఠశాలలో మరో విద్యార్థినిపై ఎలుకలు దాడి చేసినట్లు విద్యార్థులు ఈ సందర్భంగా తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.



# మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం కృషి



- మెదక్ ఎంపీడీఓ లక్ష్మి

**మెదక్ అక్టోబర్,05(సిరి న్యూస్)**

మాతా,శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని మెదక్ ఎంపీడీఓ లక్ష్మి అన్నారు. సోమవారం మెదక్ మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందనీ, ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నదనీ పేర్కొన్నారు. ప్రభుత్వం యేటా సెప్టెంబర్ మాసంలో పోషణ్ అభియాన్ మాసోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణమ్మ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం,ఆరోగ్య సంరక్షణపై ప్రచారం నిర్వహిస్తారనీ తెలిపారు. చిన్నారుల ఎదుగుదల, మాతా శిశు సంరక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నారనీ తెలిపారు. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని, పోషణ మాసోత్సవాలు విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాధవి, రమ, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ బెతయ్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ కాలనీవాసులు కలెకర్ కు వినతి పత్రం



**సదాశివపేట.అక్టోబర్ 5. (సిరిన్యూస్)**

సోమవారం నాడు సదాశివపేట సిద్ధాపూర్ ఏడవ వార్డులో స్మశాన వాటిక స్థలం గురించి జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించడం జరిగింది. సదాశివపేటలోని సిద్ధాపూర్ ఏడవ వార్డు గ్రామ ప్రజలకు వార్డులో చనిపోయిన వారి అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, స్థలం లేకపోవడం వల్ల విధి లేని పరిస్థితుల్లో సొంత పొలాలో, చెండ్లలో అంత్యక్రియలు జరపాలసి వస్తుందని, కావున మాకు సరైన ప్రభుత్వ స్థలాన్ని స్మశాన వాటిక కొరకు కేటాయించగలరని కలెక్టర్ కు విన్నవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పి. విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, మంగలి ఆంజనేయులు, అనంతరం గౌడ్ , మున్నూరు శేఖర్, జంబ విశ్వనాథం, జంగం శేఖర్, ఎరుకలి రాజు, ఎండి అయుబ్ పాషా, ఎండి నయుం, ఎండి ఖైరతాలి, తదితరులు పాల్గొన్నారు.




# కెప్టన్ స్మిత్ మచ్చుర్ ఆరోగ్యం బాగుపడాలని ప్రత్యేక పూజలు



**పెద్ద శంకరం పేట, అక్టోబర్ 5, (సిరి న్యూస్):**

కెప్టన్ స్మిత్ మచ్చుర్ భారత సంతతికి చెందిన గుజరాతీ పైలెట్. మొన్న దుబాయ్ ఫ్లై విమానం లో పైలెట్ గా విధులు నిర్వహిస్తున్న సమయం లో కో పైలెట్ ఆకస్మిక దాడి లో తీవ్రంగా గాయపడిన గాని, తన ప్రాణాలను ఫణంగా పెట్టీ 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన తీరు అభినందనీయం. కెప్టన్ స్మిత్ మచ్చుర్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం బాగుపడాలని వారు త్వరగా కోలుకోవాలని పెద్ద శంకరం పేట శివాలయంలో మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక మహా మృత్యుంజేయ జపములు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర డి డి ఎన్ అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్, మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణ శర్మ, రాజేశ్వర్ రావు, బోగయ్య గారి. నాగరాజు శర్మ, రాము, క్రాంతి లాలు, సీతారాం, అభిలాష్ శర్మ, సంగన్న పంతులు, రంగా చారి, గిరిధర్ శర్మ, కిషన్ రావు తది తరులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- అధికారులు సమన్వయంతో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ అక్టోబర్,05(సిరి న్యూస్)**

దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడి,మామిడి మొక్కల భారీ ప్లాంటేషన్ కార్యక్రమా న్నీ ఈ నెల 6న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు.ఈ మొక్కలు రామాయంపేట-సిద్ధిపేట మధ్య ఎన్ ఎచ్ 765డీజీ వెంట నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావు లు ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారనీ, పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నారని తెలిపారు. జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు. జాతీయ రహదారి వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని,పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతో భారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ,ట్రాఫిక్ ,లాంటి పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అటవీ అధికారి జోజి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమా భార్గవి,డిఎస్పి ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం 'చలో కలెక్టరేట్'

- ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఉద్యమం.
- డీసీసీ అధ్యక్షులు శివన్నగారి ఆంజనేయులు గౌడ్.

**మెదక్ అక్టోబర్,05(సిరి న్యూస్)**

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి తలపెట్టిన ఉద్యమంలో భాగంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ మరియు పీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు మరియు ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై నాయకులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 10:00 గంటలకు "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలకు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నేతలు, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజ్,వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, కౌన్సిలర్లు అనుబంధ సంఘాల నాయకులు మల్లేశం కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.



# యుఫెర్వాస్ సైబరాబాద్ అధ్యక్షుడిగా రమణ ఈశ్వరగారి

- ముడు వేలకుపైగా ఆర్‌డబ్ల్యూఏలకు నాయకత్వం

**రామచంద్రపురం, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**



యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (యుఫెర్వాస్) సైబరాబాద్ విభాగం అధ్యక్షుడిగా రమణ ఈశ్వరగారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెప్టెంబర్‌లో అల్వాల్‌లో జరిగిన యుఫెర్వాస్ పాలక మండలి సమావేశంలో ఆయనను రెండేళ్ల పదవీకాలానికి ఎన్నుకున్నారు. విస్తరించిన హైదరాబాద్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ సంఘాలు, సహకార గృహ నిర్మాణ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలకు యుఫెర్వాస్ ప్రాతినిధ్యం వహిస్తోంది. సైబరాబాద్ పరిధిలో 3 వేలకుపైగా నివాస సంక్షేమ సంఘాలు (ఆర్‌డబ్ల్యూఏలు) ఈ వేదికలో భాగంగా ఉన్నాయి. కొత్త అధ్యక్షుడిగా రమణ ఈశ్వరగారి ఆర్‌డబ్ల్యూఏల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, నివాసితుల సమస్యలకు సమిష్టి వాణిని అందించడం, ప్రభుత్వ శాఖలతో నిర్మాణాత్మకంగా చర్చించడం, పౌర మౌలిక వసతులు, ప్రజా సేవలు, భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు. రాష్ట్ర స్థాయి యుఫెర్వాస్‌తో పాటు జాతీయ స్థాయి కాన్ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (కోఆర్‌డబ్ల్యూఏ)తో సమన్వయం చేసుకుంటూ నివాస సముదాయాల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఏలు పట్టణ సమస్యల పరిష్కారం, సమాజ నిర్మాణం, స్వీయ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని యుఫెర్వాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. రావు వీబీజే చెలికాని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలోని ఆర్‌డబ్ల్యూఏలు, ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి మెరుగైన, సురక్షితమైన, సుస్థిర నివాస ప్రాంతాల నిర్మాణానికి కృషి చేయనున్నట్లు యుఫెర్వాస్‌సైబరాబాద్ తెలిపింది.

# వీధి దీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

- డార్క్ స్పాట్లను తొలగించాలి: బీఆర్ఎస్ నాయకుడు ఐలేష్

**రామచంద్రపురం, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

రామచంద్రపురం, భారతీనగర్ డివిజన్ల పరిధిలో వీధి దీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఐలేష్ కోరారు. ఈ మేరకు అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. పలు కాలనీలు, ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగక చీకటి ప్రాంతాలు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. పాడైన దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి ఎల్ఐజీ మ్యాక్స్ సొసైటీ కాలనీలకు వెళ్లే మార్గం, రామచంద్రపురం షాపింగ్ సెంటర్ నుంచి స్మశాన వాటికకు వెళ్లే రహదారిపై రాత్రివేళల్లో వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డార్క్ స్పాట్లను తొలగించాలని ఐలేష్ విజ్ఞప్తి చేశారు. వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి స్పష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.




# పటాన్ చెరు లో అండర్–17 బాలికల క్రికెట్ సెలక్షన్స్

- పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

**పటాన్ చెరు, అక్టోబర్ 5, (సిరి న్యూస్):**

పటాన్ చెరు పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన 70వ ఎస్ జీ ఎఫ్ ఐ కంబైన్డ్ మెదక్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాలికల క్రికెట్ సెలక్షన్స్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సెలక్షన్స్ లో ప్రతిభ కనబరిచిన బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎం డీ ఆర్ ఫౌండేషన్ కోఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్, మైత్రి క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ హనుమత్ రెడ్డి, ఎం. రామరాజు, కోచ్‌లు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు. క్రీడల్లో బాలికలను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభకు మంచి వేదిక కల్పించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనాలన్నారు. ప్రతిభను చాటి, విజయాల వైపు అడుగులు వేయాలన్నారు.



# కాకా వెంకటస్వామికి భారతరత్న ఇవ్వాలి

- 97వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**పటాన్‌చెరు, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి దివంగత కాకా వెంకటస్వామికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన 97వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మికుల సంక్షేమానికి వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఏడు పర్యాయాలు పార్లమెంట్‌కు ఎన్నికైన ఆయన కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కార్మికులకు పెన్షన్ పథకం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రవికుమార్, అంబేద్కర్, ప్రవీణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



# రజకుల సంక్షేమానికి కృషి..

- రజకులు సమాజానికి ఆడబిడ్డల్లాంటి వారు.
- జిల్లా కేంద్రంలో రజకభవన నిర్మాణానికి హామీ.
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు.




**మెదక్ అక్టోబర్,05(సిరి న్యూస్)**

రజకులు సమాజానికి ఆడబిడ్డల్లాంటి వారని, మనిషి పుట్టక మొదలు కాటికి వెళ్లేవరకు వారు చేసే సేవలు ఎనలేనివని వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రజక మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజకుల అభివృద్ధి సమాజాభివృద్ధిలాంటిదన్నారు. వారికి పట్టణ పరిధిలో ఎకరం ప్రభుత్వం స్థలం ఇవ్వటంతో పాటూ భవన నిర్మాణానికి నిధులు సమకూర్చుతనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. గతంలో 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు గాలి మాటలు తప్పా చేసిందేమి లేదన్నారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ, సమాజంలో నిస్వార్థ సేవకులు రజకులేనని కొనియాడారు. జిల్లా కేంద్రంలో రజకభవన నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం రజకఫెడరేషన్ చైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగించే వారిలో అత్యంత వెనుకబడిన వారు రజకులని వాపోయారు. భవన నిర్మాణంకోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రమణ మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు కృషితో రజక భవనం సాధించుకుని ఆయనకు కృతజ్ఞతగా ఉండాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కానుగ రాధిక, నరేశ్‌గౌడ్, రజక రాష్ట్రనేతలు శ్రీనివాస్, సంపత్, పట్టణ అధ్యక్షులు మల్లేశం, శివ, వేణు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ప్రభుత్వ భూములు కేటాయించండి

- సబ్‌స్టేషన్లకు స్థలాలు.. ఇస్నాపూర్ పోలీస్‌స్టేషన్‌కు 2 ఎకరాలు
- కొల్లూరు మిగులు భూమిని స్థానిక అవసరాలకే వినియోగించాలి: ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ భూములను కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సోమవారం సంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సమావేశమైన ఆయన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు. స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ ద్వారా తదుపరి అనుమతుల ప్రక్రియను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇస్నాపూర్‌లో నూతన పోలీస్‌స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన సర్వే నంబర్ 203లోని 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాలు మిగిలి ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ భూమిని ఇతర అవసరాలకు మళ్లించకుండా స్థానిక ప్రజల అవసరాలకే వినియోగించాలని కోరారు. మోడల్ మార్కెట్‌తో పాటు హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికల ఏర్పాటుకు భూమిని కేటాయించాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# రెండు పడవలు ఢీకొని 30 మందికి పైగా మృతి

- డజన్ల కొద్దీ గల్లంతు
- కాంగో నదిలో ఘోర ప్రమాదం

**కిన్షా సా, అక్టోబర్ 5 :**

కాంగో నదిలో రెండు పడవలు ఢీకొన్న ఘటనలో 30 మందికిపైగా మృతిచెందగా, డజన్లకొద్దీ గల్లంతయ్యారని కాంగో అధికారులు సోమవారం తెలిపారు. ప్రావిన్షియల్ అంతర్గత వ్యవహారాల మంత్రి క్రిస్పిన్ మ్పుటు ప్రకారం ఈక్వేటర్ ప్రావిన్స్‌లోని న్గొంబేలుకోలెలా ప్రాంతం సమీపంలో ఆదివారం సాయంత్రం మోటారుతో నడిచే చెక్క పడవలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. ప్రమాదంలో మరణించిన వారికి ఇప్పటికే అంత్యక్రియలు జరిపినట్లు మంత్రి అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. ఒక పడవ వాయువ్య దిశలో ఉన్న ఉబాంగి నుండి రాజధాని కిన్షాసాకు ప్రయాణిస్తుండగా మరొకటి కిన్షాసా నుండి ప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉన్న లుకోలెలాకు వెళుతోందని మ్పుటు చెప్పారు. ఇంకా బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నది ఒడ్డు నుండి ప్రమాదాన్ని చూశానని చెప్పిన భద్రతా దళాల సభ్యుడు ఒకరు ఏపీతో మాట్లాడుతూ 'ఉబాంగి నుండి తిరిగి వస్తున్న పడవ సరుకులతో నిండిపోయి కిన్షాసా నుండి వస్తున్న పడవను ఢీకొట్టింది' అని తెలిపారు. పడవలోని ప్రయాణికులలో దాదాపు అందరూ నీటిలో చిక్కుకుపోయారు.. పడవ కూడా మునిగిపోయింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఆయన తెలిపారు. మధ్య ఆఫ్రికా దేశమైన ఈ దేశంలో ఘోరమైన పడవ ప్రమాదాలు సర్వసాధారణం. రాత్రిపూట ప్రయాణాలు, రద్దీగా ఉండే పడవలే వీటికి కారణమని తరచుగా ఆరోపిస్తుంటారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో పేలవమైన భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కొరత కూడా ఇటీవలి సంవత్సరాల్లో పడవ ప్రమాదాల్లో వందలాదిమంది మరణించడానికి కారణమవుతున్నాయి. జూలైలో రాష్ట్ర పరీక్షల నుండి విద్యార్థులను తిరిగి తీసుకు వస్తున్న ఒక చెక్క పడవ మధ్య భారతదేశంలో మునిగిపోయి కనీసం 20 మంది మరణించారు. ఆ నౌక కసాయ్ ప్రావిన్స్‌లో ప్రయాణిస్తుండగా సంకురు, కసాయ్ నదుల సంగమ ప్రాంతంలోకి ప్రవేశించే సమయంలో మునిగిపోయింది. గతంలో రాత్రిపూట పడవ ప్రయాణాల వల్ల అనేక ప్రమాదాలు జరిగాయని మంత్రి క్రిస్పిన్ మ్పుటు తెలిపారు.

# రూ.7 కోట్లతో ఏడు లింకు రోడ్ల అభివృద్ధి..

- పెండింగ్ నిధులు విడుదల చేయాలి: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**శివ్వంపేట, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

శివ్వంపేట మండలంలోని గంగాయిపల్లి నుంచి తండా మీదుగా చండి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సర్పంచ్ రావెల్లి సాయిలుతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.7 కోట్లతో శివ్వంపేట మండలంలో ఏడు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ.108 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో 26 రోడ్లకు సంబంధించిన రూ.148 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రహదారి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు నిలిచిపోయినప్పటికీ కాంట్రాక్టర్ కాంతారావు ముందుకొచ్చి పనులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం కాంట్రాక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పవన్‌కుమార్ గుప్తా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్‌గౌడ్, నారాయణరావు, బానోత్ కవిత, బీఆర్ఎస్ నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, జగన్‌రెడ్డి, లాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# పౌష్టికాహారం తోనే ఆరోగ్యం పదిలం

- తాహాసిల్దార్ విజయలక్ష్మి
- ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి

**వెల్దుర్తి, అక్టోబర్ 05, (సిరి న్యూస్):**

గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు సరియగు పౌష్టికాహారం తీసుకోవడం వలనే గర్భవతులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎదిగే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఏదుగుతారని తాహాసిల్దార్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీ శక్తి భవనంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి, లక్ష్మీల, అధ్యక్షతన పోషకాహార వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడి టీచర్లు వివిధ రకాల సహజ సిద్ధంగా లభించిన ఆకుకూరలు పిండివంటలు, కాయగూరలు, స్వీట్స్, ప్రదర్శించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి సమతుల్య ఆహారాన్ని న్యూట్రిషన్ వివరాలను అధికారులకు చూయిస్తూ పోషక విలువలను వివరించారు. అంతకుముందు అంగన్వాడి సేవలను అంగన్వాడి కేంద్రా లో అందించే అదనపు ఆహార విలువలను గర్భిణీ బాలింతలకు కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన కుటుంబం కోసం ప్రతి ఒక్కరు పోషకాహారాన్ని తీసుకోవాలని తెలియజేశారు. సాజసిద్ధంగా దొరికే అన్ని రకాల ఆకుకూరలు పండ్లు చిరుధాన్యాలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో అందించే అదనపు ఆహారం అంగన్వాడి కేంద్రంలోని భుజించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లో 15 రోజులకోసారి చేసే వైద్య పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలను వాడాలన్నారు. గర్భిణీలు బాగుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతులుగా జన్మిస్తారని అన్నారు. అంగన్వాడి కేంద్రంలోని అందించే అదనపహారాన్ని భుజించి పండంటి బిడ్డకు జన్మ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడి టీచర్లు ఏపిఎం సుభాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా బూరుగడ్డ జాన్వీక పుట్టినరోజు వేడుకలు



**రామచంద్రపురం, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పెద్ద మనవరాలు బూరుగడ్డ జాన్వీక పుట్టినరోజు వేడుకలను రుద్రారం గ్రామంలోని శ్రీ సిద్ధి వినాయక దేవస్థానం (గణేష్ గడ్డ)లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సిద్ధి వినాయక స్వామి వారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని, ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని జాన్వీకకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# జాతీయ స్థాయి ప్రేరణ కి ఎంపికైన గీతా స్కూల్ విద్యార్థిని

**తూప్రాన్ అక్టోబర్ 05 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని గీతా స్కూల్ కు చెందిన విద్యార్థిని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ప్రేరణ 2.0" కార్యక్రమానికి సోమవారం తూప్రాన్ గీతా స్కూల్ లో పదవ తరగతి విద్యార్థిని బి. మహతి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. అరుణ తెలియజేశారు. 912 వ తరగతి చదువుతున్న విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం విలువలతో కూడిన విద్యను అందించడం ప్రధాన లక్ష్యంగా మెదక్ జిల్లా విద్యాశాఖధికారి పర్యవేక్షణలో మెదక్ జిల్లా పరిషద్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో అత్యంత ప్రతిభను కనబరచిన మహతి గుజరాత్ రాష్ట్రంలోని మెహెసానా జిల్లా వద్నగర్ లో ఉన్న వెర్నాక్యులర్ పాఠశాలలో నివాస శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అక్కడ భారత ప్రధాని మాననీయ నరేంద్ర మోదీజీ చదువుకున్న పాఠశాలతో పాటు ఐ. ఐ. టి గాంధీనగర్ ను సైతం సందర్శిస్తారని తెలిపారు.

నాయకత్వ వికాసం, దేశ సంస్కృతిపై అవగాహన, వారసత్వం, చరిత్ర లాంటి వైవిధ్యమైన అంశాలను విద్యార్థులలో ప్రోది చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు బి. రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, భరత్, డాక్టర్ మౌనిక, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ మరియు ఉపాధ్యాయులు మహతిని అభినందించారు.




# విద్యుత్ కోతలతో ఎండిన పంటలు

- రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి
- నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందించాలి: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**శివ్వంపేట, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలో రైతులు గొల్ల బిక్షపతి యాదవ్, పెద్దదాసరి రవికి చెందిన ఎండిపోయిన వరి పంటలను ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సక్రమంగా అందక బోర్లు పనిచేయకపోవడంతో పెట్టుబడులు పెట్టినప్పటికీ పంటలు ఎండిపోయాయని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. సుమారు మూడు ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టంపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు.

**లో ఓల్టేజీతో మోటార్లు దెబ్బతింటున్నాయి**

ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లోపాల కారణంగా తరచూ లో ఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. దీంతో బోరు మోటార్లు సైతం దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ అందించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని విమర్శించారు. పంటలు చివరి దశలో ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**రైతుల కోసం ఉద్యమం**

ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమాలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పవన్‌కుమార్ గుప్తా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్‌గౌడ్, నారాయణరావు, బానోత్ కవిత, బీఆర్ఎస్ నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, జగన్‌రెడ్డి, లాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గీతంలో ఎడిటింగ్, ప్రచురణపై కార్యశాల



**పటాన్ చెరు, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం ఎడిటింగ్, ప్రచురణపై రెండు రోజుల కార్యశాల ప్రారంభమైంది. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఓరియంట్ బ్లాక్‌స్వాన్, జుబాన్ బుక్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వ్రాతప్రతి నుంచి ప్రచురణ, మార్కెటింగ్ వరకు అంశాలపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పిస్తున్నారు. ప్రచురణ నిపుణులు ఊర్వశి బుటాలియా, డా. సి. రామ్మనోహర్ రెడ్డి, శ్రీనాథ్ శ్రీధరన్ తదితరులు పాల్గొంటున్నారు.

**ఘనంగా ప్రపంచ వాస్తుశిల్ప దినోత్సవం**

అదేరోజు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో ప్రపంచ వాస్తుశిల్ప దినోత్సవం2026ను నిర్వహించారు. సమర్ రామచంద్ర అసోసియేట్స్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ సమరేంద్ర ఎం. రామచంద్ర 'గృహనిర్మాణం: ఒక మానవ దృక్పథం'పై ప్రసంగించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనోత్సవం



- **కాశీ వేద పండితులతో ప్రత్యేక పూజలు.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి**

**శివ్వంపేట, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

మండల కేంద్రం శివ్వంపేటలో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాశీక్షేత్రం నుంచి వచ్చిన వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా శివశక్తి యూత్ అధ్యక్షుడు కొడకంచి శివప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో యువత, భక్తులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు పక్కా ఇళ్ళు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం



- **నాగ్వార్ సర్పంచ్ గురుదాస్**

**రాయికోడ్, అక్టోబర్ 05(సిరిన్యూస్):**

పేద ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తు, పక్కా ఇళ్ళు నిర్మించి వారికి భరోసా కల్పిస్తుందని రాయికోడ్ మండలం నాగ్వార్ గ్రామ సర్పంచ్ అలిగే గురుదాస్ అన్నారు. నాగ్వార్ గ్రామంలో ప్రభుత్వం నుండి బేగరి రమేష్, పి. సుజాత, విట్టల్ లబ్ధిదారులు మంజూరైనా ఇందిరమ్మ ఇళ్లకు మంత్రి దామోదర్ రాజానర్సింహా, గ్రంథాలయం చైర్మన్ అంజయ్య ఆదేశానుసారం సోమవారం గ్రామ పెద్దలతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గురుదాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లో బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక కృషి, గ్రంథాలయం చైర్మన్ అంజయ్య సహకారంతో గ్రామం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు.

# మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి తో మధుసూదన్ రావు మర్యాదపూర్వక భేటీ

**జహీరాబాద్, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డిని, జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా మాజీ అధ్యక్షులు ఎం. మధుసూదన్ రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నివాసానికి వెళ్లిన మధుసూదన్ రావు ఆయనతో కొద్దిసేపు సమావేశమై పలు అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుభాష్ రెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగా జరిగినట్లు మధుసూదన్ రావు తెలిపారు.



# వైద్యుల నిర్లక్ష్యంపై ఎంపీ ఆగ్రహం

- **సంవత్సరాలుగా ప్రసవాలు జరగకపోవడంపై నిలదీత**
- **గైనకాలజిస్టు సేవలు వెంటనే అందుబాటులోకి తేవాలని ఉన్నతాధికారులకు ఆదేశం**
- **గవర్నర్ పర్యటన ఏర్పాట్లను**
- **పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు**





**రామాయంపేట, అక్టోబర్ 4 (సిరి న్యూస్)**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తే సహించేది లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొన్ని నెలలుగా ప్రసవాలు జరగకపోవడం, ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేకపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం అలాగే వైద్యుల తీరుపై ఎంపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ నిధులతో మంజూరు చేసిన డెంటల్ చైర్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు, నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వైద్యులను ప్రశ్నించారు. ప్రజలకు అందాల్సిన వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులు, అధికారులపై ఉందన్నారు. గైనకాలజిస్టు సేవలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ లింబాద్రి, మండల వైద్యాధికారి హరిప్రియ తోపాటు పలువురు ఉన్నారు.

**గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ**

రామాయంపేటలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పర్యటన ఏర్పాట్లను, ఎంపీ రఘునందన్ రావు పరిశీలించారు. 765 డీజీ జాతీయ రహదారి మెదక్ నుంచి ఎలుకతుర్తి వరకు నూతనంగా నిర్మించిన రహదారి పక్కన ఒకేరోజు 32 వేల మొక్కల నాటే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయనతోపాటు తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్, మెదక్ ఆర్డిఓ రమాదేవి, రామాయపేట తహసిల్దార్ రజనీకుమారి, ఎస్ఐ బాలరాజు తో పాటు పలువురు ఉన్నారు.

# మెదక్ జిల్లాలో కరెంటు పెద్ద సారు పర్యటన





- **160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్‌పై ఆరా..**
- **కౌడిపల్లి, మిన్పూర్ సబ్‌స్టేషన్ల పరిశీలన**

**మెదక్, అక్టోబర్ 5 సిరి న్యూస్**

మెదక్ జిల్లాలో విద్యుత్ సరఫరా పరిస్థితి, సబ్‌స్టేషన్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్లపై నమోదవుతున్న లోడ్‌ను పరిశీలించేందుకు టీజి ఎస్పి డిసి ఎల్ సీఎండీ జితేష్ పాటిల్, మెదక్ జిల్లాలో సోమవారం నాడు పర్యటించారు. జిల్లాలో విద్యుత్ సరఫరాకు కీలకంగా ఉన్న సబ్‌స్టేషన్లను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ 220/132 కేవీ సబ్‌స్టేషన్‌లో 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఏర్పడిన ఓవర్‌లోడ్ పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీయడం పర్యటనలో ప్రాధాన్యత సంతరించుకుంది. పర్యటనలో భాగంగా ముందుగా కౌడిపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సీఎండీ జితేష్ వి. పాటిల్ సందర్శించారు. సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించి, ప్రస్తుతం ఉన్న లోడ్ పరిస్థితి, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ సరఫరా తీరుపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయనే విషయాన్ని తెలుసుకోవడంతో పాటు, వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు చేపడుతున్న చర్యలపై అధికారులతో చర్చించారు. కౌడిపల్లి సబ్‌స్టేషన్ పరిశీలన అనంతరం మెదక్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గ భవానీ అమ్మ వారి ఆలయాన్ని సీఎండీ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్ 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మిన్పూర్ సబ్‌స్టేషన్‌లో 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆదివారం నమోదైన లోడ్ పరిస్థితిపై సీఎండీ ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిస్థాయి లోడ్‌కు చేరుకోవడంతో ఓవర్‌లోడ్ పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలోని కొన్ని సబ్‌స్టేషన్లకు, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిన విషయం గురించి అధికారులను ఆరా తీశారు. 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎంత మేరకు లోడ్ నమోదైంది.. ఏ సమయంలో లోడ్ గరిష్ఠ స్థాయికి చేరుకుంది.. ఓవర్‌లోడ్‌కు కారణమైన పరిస్థితులు ఏమిటి.. దాని ప్రభావంతో ఏయే సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.. వినియోగదారులకు ఎంతసేపు ఇబ్బంది ఎదురైంది.. అనంతరం సరఫరాను ఏ విధంగా పునరుద్ధరించారు.. తదితర వివరాలను సీఎండీ అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. జిల్లాలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో మిన్పూర్ సబ్‌స్టేషన్‌పై పడుతున్న లోడ్ పరిస్థితిని సీఎండీ స్వయంగా పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఫుల్ లోడ్‌కు వెళ్లిన సందర్భంలో ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది. సబ్‌స్టేషన్లలో లోడ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. మిన్పూర్ 220/132 కేవీ సబ్‌స్టేషన్ జిల్లాలో విద్యుత్ సరఫరా వ్యవస్థలో కీలకమైన కేంద్రంగా ఉండటంతో అక్కడి పరిస్థితులను సీఎండీ క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్‌స్టేషన్‌కు వస్తున్న విద్యుత్, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు జరుగుతున్న సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లపై నమోదవుతున్న లోడ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రానున్న రోజుల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నందున లోడ్ పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించినట్లు తెలిసింది. ఓవర్‌లోడ్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం పెద్ద సంఖ్యలో వినియోగదారులపై పడే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎండీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు సమాచారం ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ రూరల్ జోన్ బాలస్వామి, మెదక్ సర్కిల్ ఇంజనీర్ నారాయణ నాయక్, డివిజన్ ఇంజనీర్ రామేశ్వర స్వామి ,ఏడీఈ మోహన్ బాబు, విద్యుత్ శాఖ ఏఇలు సబ్ ఇంజనీర్ శంకర్ పాల్గొన్నారు

# కొల్చారం మండల సర్వసభ్య సమావేశం




- **కరెంటు సమస్యలపై సర్పంచుల ఫైర్**

**కొల్చారం, అక్టోబర్ 05 (సిరి న్యూస్)**

మండల కేంద్రమైన కొల్చారంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు హాజరయ్యారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, సాధించిన ప్రగతిపై అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనులకు విద్యుత్ లైన్మెన్లు పంచాయతీ పాలకవర్గాలకు సహకరించాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై విద్యుత్ శాఖ సబ్‌ఇంజనీర్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, లోవోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తిస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాల వద్ద ట్యాబ్ పెంచే చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదన్నారు. మండలంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో సంతోష్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ , హౌసింగ్ ఏఈ సుష్మ, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# కాకా జయంతికి ఘన నివాళి..

- **తెలంగాణ ఉద్యమంలో కాకా కీలక పాత్ర..**
- **పేద విద్యార్థులకు ఉచిత విద్యతో సేవలు..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (సిరి న్యూస్)**

తెలంగాణ ఉద్యమం, పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రజాసేవలో విశేష కృషి చేసిన మాజీ కేంద్రమంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి,కాకా 97వ జయంతిని బెల్లంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని కాకా వెంకటస్వామి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, తొలి తెలంగాణ ఉద్యమంలో కాకా వెంకటస్వామి కీలకంగా పాల్గొన్నారని, పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ ప్రజలకు విశేష సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సతీష్, గట్టు బానేష్, చింతల లోకేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గద్దల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాకా ఆశయాలే లక్ష్యం..





- యువతకు ఉపాధే కాకా ఆశయం..
- పెన్షన్ రూ.10 వేలకు పెంచాలి!..
- ఆర్ఎఫ్‌సీఎల్ నిర్లక్ష్యాన్ని సహించం!..
- ప్రాణహిత-చేవెళ్లకు కృషి..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (సిరి న్యూస్)

తెలంగాణ కోసం బుల్లెట్ తగిలినా వెనక్కి తగ్గని కాకా వెంకటస్వామి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, యువతకు ఉపాధి, పేదలకు న్యాయం, కార్మికులకు గౌరవం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రకటించారు. కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో వంశీకృష్ణ పాల్గొని ట్యాంక్‌బండ్ వద్ద కాకా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కాకా సేవలను, తెలంగాణ కోసం సాగించిన పోరాటాన్ని గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా కాకా అందరినీ ఆప్యాయంగా కలుపుకుపోయారని, అందుకే వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనకు నివాళులర్పించేందుకు ఒకే వేదికపైకి వచ్చారని తెలిపారు. తెలంగాణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుడు కాకా వెంకటస్వామి అని వంశీకృష్ణ కొనియాడారు. లక్షలాది మంది పేదలు, కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇప్పించి అండగా నిలిచిన కాకా



ఆశయాలకు భిన్నంగా గత పాలనలో భూకబ్జాలు, భూదందాలు, ఇసుక మాఫియా పెరగడం బాధాకరమని వ్యాఖ్యానించారు..

**కార్మికుల పెన్షన్ రూ.10 వేలు చేయాలి..**

కార్మికుల కోసం కాకా తీసుకొచ్చిన పెన్షన్ ఇప్పటికీ కేవలం రూ.500గా ఉండటం దారుణమని వంశీకృష్ణ అన్నారు. కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తూ పార్లమెంట్‌లో గట్టిగా పోరాడుతున్నామని తెలిపారు..

**ఆర్ఎఫ్‌సీఎల్‌పై ఢిల్లీ పెత్తనం సహించం..**

రామగుండం ఎరువుల కర్మాగారం విషయంలో కాకా వెంకటస్వామి, మంత్రి వివేక్ వెంకటస్వామి చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ, ఆర్ఎఫ్‌సీఎల్‌ను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని వంశీకృష్ణ హెచ్చరించారు. సుమారు 3 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తున్న సంస్థను బలోపేతం చేయాలని, తెలంగాణ రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందేలా రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు..

**యువత చేతిలో ఉద్యోగం..ఇదే కాకా కల..**

తెలంగాణ యువతకు ఉద్యోగాలు, ఆధునిక నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉద్యోగ అవకాశాలు, ఆధునిక సాంకేతిక కేంద్రాల ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు..

**ప్రాణహిత-చేవెళ్లకు మళ్లీ కదలిక..**

కాకా వెంకటస్వామి కలలుగన్న ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని వంశీకృష్ణ తెలిపారు. సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చర్చించినట్లు వెల్లడించారు. కాకా ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తామని, ప్రజా సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన పోరాట బాటలోనే ముందుకు సాగుతామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# ఫీజుల వేధింపులకు అడ్డుకట్ట ఎప్పుడు.?..

- ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న ప్రవేట్ పాఠశాలలు..
- విద్యార్థిపై ఇనుప కడ్డీ దాడి ఘటనపై విచారణకు డిమాండ్..
- సెలవు రోజున పాఠశాల నిర్వహణపైనా చర్యలు కోరిన విద్యార్థి సంఘాలు.

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (సిరి న్యూస్)



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్ల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం, పరీక్షలకు అనుమతించకుండా మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సగం సంవత్సర పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తూ పరీక్షలకు అనుమతించకపోవడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నస్పూర్ మండల కేంద్రంలోని మార్టిన్స్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో సెలవు రోజైన ఆదివారం పాఠశాల నిర్వహించడంతో పాటు, ఆలస్యంగా వచ్చిన విద్యార్థిపై ఉపాధ్యాయుడు ఇనుప కడ్డీతో దాడి చేసిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థికి గాయాలైన ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సెలవు రోజున పాఠశాల నిర్వహించిన అంశంపైనా విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్, పూరెళ్ల నీతిష్, రేగుంట క్రాంతి, బచ్చలి అభిరామ్, కుమ్మరి రాజబాబు, బచ్చలి జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాకా విగ్రహానికి శ్రీకారం..

- కార్మికుల హక్కుల కోసం కాకా చేసిన పోరాటం చిరస్మరణీయం..
- కాకా సేవలను భావితరాలకు చాటేలా విగ్రహ ఏర్పాటు..
- భూమి పూజలో డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి..
- మందమర్రి కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల రెడ్డి సహా నాయకుల హాజరు..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (సిరి న్యూస్)



కార్మికుల హక్కులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన స్వర్గీయ గడ్డం వెంకటస్వామి, కాకా సేవలను స్మరించుకుంటూ మందమర్రిలో ఆయన విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా మందమర్రి పట్టణంలోని సింగరేణి పార్క్ సమీపంలో విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిన్నింటి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కాకా వెంకటస్వామి రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా కార్మికుల హక్కులు, సంక్షేమం, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడని తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో వినిపించి, వారి సంక్షేమం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాకా ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ఆయన 97వ జయంతి సందర్భంగా మందమర్రిలో విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేయడం గర్వకారణమని తెలిపారు. ఈ విగ్రహం భవిష్యత్ తరాలకు కాకా సేవలను గుర్తుచేసే స్మారక చిహ్నంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, వైద్య విభాగం, ఎస్సీ విభాగం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా కలెక్టర్ ను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

తూప్రాన్ అక్టోబర్ 05 సిరి న్యూస్

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు .ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం, శాలువా అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ సభ్యులు లయన్ జానకిరామ్ గౌడ్ మాట్లాడుతూ.... నా పై నమ్మకం తో భారీగా ఓట్లు వేసి గెలిపించిన ప్రతిఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు.. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ప్రణాళిక డాక్టర్ జానకిరామ్ మెదక్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన లయన్ డాక్టర్ సి.ఆర్. జానకిరామ్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి భవిష్యత్ కార్యాచరణను వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ల ఏర్పాటు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. అలాగే ప్రకృతి విపత్తులు, వరదలు, అగ్ని ప్రమాదాల సమయంలో బాధితులకు అండగా నిలవడం, వృద్ధులు, అనాథలకు సహాయం అందించడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు డాక్టర్ జానకిరామ్ తెలిపారు. రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు





# మెదక్ లో సందడే సందడి

- ఘనంగా 'వైభవం' బట్టల షోరూం ప్రారంభించిన ఎమ్మెల్యే.
- వ్యాపార రంగ అభివృద్ధికి ప్రోత్సాహం.
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.

మెదక్ అక్టోబర్, 05(సిరి న్యూస్)

మెదక్ పట్టణంలో సోమవారం వైభవం బట్టల షోరూంను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. షోరూం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ పట్టణంలో కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం స్థానిక ఆర్థిక వ్యవస్థకు శుభపరిణామమన్నారు. వ్యాపార కార్యకలాపాలు విస్తరించడంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.

మెదక్ పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్థానిక వ్యాపారులకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికా భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు. వైభవం షాపింగ్ మాల్ తదితరులు పాల్గొన్నారు.



**సందడి చేసిన సినీతార ఫరీన్ అబ్దుల్లా**

వైభవం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీతర ప్రముఖ హీరోయిన్ ఫారిన్ అబ్దుల్లా సందడి చేశారు.వైభవం షాపింగ్ మాల్ లో నూతన వెబ్ సైట్, మరియు వైభవం యాప్ ప్రారంభయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.మెదక్ పరిసర ప్రాంత ప్రజలకు సరికొత్త ప్యాషన్ డిజైన్స్ తో అందుబాటు ధరలతో వైభవం షాపింగ్ మాల్ మీ ముందుకు వచ్చిందని అన్నారు. అభిమానులను ఉత్సాహపరుస్తూ సందడి చేశారు.



# శివ్వంపేటలో డీటీఎఫ్ విస్తృత తనిఖీలు




- అక్రమ మద్యం విక్రయంపై కేసు నమోదు
- గొట్టిముక్కుల తండాలో డ్రగ్స్‌పై అవగాహన
- నర్సాపూర్–తూప్రాన్ రోడ్డుపై అనుమానాస్పద వాహనాల తనిఖీ
- A4 మద్యం దుకాణాల్లో స్టాక్ పరిశీలన

శివంపేట్ , అక్టోబర్ 5 (సిరి న్యూస్):

మెదక్ జిల్లా పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై అధికారులు నిఘా ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం డీటీఎఫ్ మెదక్ బృందం, నర్సాపూర్ ఎస్‌హెచ్‌ఓ బృందంతో కలిసి శివ్వంపేట మండల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. తనిఖీల సందర్భంగా అక్రమంగా ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ లిక్కర్) మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి ఒక కేసు నమోదు చేశారు. అలాగే కల్లు నాణ్యతను పరిశీలించేందుకు ఒక కల్లు నమూనాను సేకరించారు. అనంతరం శివ్వంపేట మండలంలోని గొట్టిముక్కుల తండాలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తదుపరి నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై రూట్ వాచ్ నిర్వహించి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి నేరపూరిత కార్యకలాపాలు గుర్తించలేదని అధికారులు తెలిపారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని A4 మద్యం దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. రికార్డులు, అందుబాటులో ఉన్న స్టాక్‌ను పరిశీలించగా ఎలాంటి అవకతవకలు గుర్తించలేదని అధికారులు వెల్లడించారు.

# ఆరుట్ల, ఫసల్‌వాది, కంది హెచ్ఎండీఏ లేఅవుట్లపై కలెక్టర్ సమీక్ష



- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం
- గత ప్రభుత్వ హయాంలో భూములు కోల్పోయిన రైతులకు ఊరట
- నవంబర్ చివరికల్లా చేసి రైతులకు ప్లాట్లు కేటాయించాలని ఆదేశాలు

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఆరుట్ల, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అంశంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో గతంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా తమ భూములు అప్పగించి, సర్టిఫికెట్లు పొందినప్పటికీ ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ దక్కక రైతులు పడుతున్న ఇబ్బందులను జగ్గారెడ్డి, నిర్మల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రస్తుత పరిస్థితి ఏమిటి, పనులు ఎందుకు ఆలస్యమయ్యాయి, ఎంత మేరకు పూర్తయ్యాయనే అంశాలపై హెచ్ఎండీఏ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరుట్లలో 106 ఎకరాల 14 గుంటల్లో లేఅవుట్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, లబ్ధిదారుల తుది జాబితా ఇంకా అందలేదని అధికారులు తెలిపారు. ఇక్కడ భూసేకరణ ప్రక్రియ సుమారు 60 శాతం పూర్తయిందని, కొన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. కంది గ్రామంలో 50 ఎకరాలకు హెచ్ఎండీఏ లేఅవుట్ ప్రతిపాదించగా, ప్రస్తుతం 46 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారుల జాబితా పంపాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా కంది లేఅవుట్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**నవంబర్ చివరికల్లా ప్లాట్ల కేటగిరీ పూర్తి చేయాలి: జగ్గారెడ్డి**

రైతులు సంవత్సరాలుగా ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్నందున, ఇకపై ఎలాంటి జాప్యం జరగకూడదని జగ్గారెడ్డి అధికారులను కోరారు. కంది, ఫసల్‌వాది, ఆరుట్ల లేఅవుట్లకు సంబంధించిన మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి.. వచ్చే నవంబర్ చివరికల్లా భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో ఉన్న పెండింగ్ సమస్యలను, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నవంబర్ గడువులోగా ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు.

# ఎస్సై స్థాయి నుంచి సీఐ స్థాయికి.. గుమ్మడిదల పోలీస్ స్టేషన్ ప్రస్థానం

- ఒకనాడు మండల కేంద్రానికే నోచుకోని గ్రామం.. నేడు మున్సిపాలిటీగా రూపాంతరం
- అభివృద్ధి బాటలో మరో ముందడుగు.. సీఐ స్థాయికి చేరిన గుమ్మడిదల పోలీస్ స్టేషన్

**గుమ్మడిదల, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**



ఒకప్పుడు మండల కేంద్రం అనే గుర్తింపునకు కూడా నోచుకోని సాధారణ గ్రామంగా ఉన్న గుమ్మడిదల. నేడు మండల కేంద్రంతో పాటు మున్సిపాలిటీగా రూపాంతరం చెంది అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. కాలక్రమేణా పెరిగిన జనాభా, విస్తరించిన పారిశ్రామిక రంగం, పెరిగిన రాకపోకలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలోనూ గుమ్మడిదలకు ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో పోలీస్ శాఖలోనూ గుమ్మడిదల మరో కీలక మైలురాయిని చేరుకుంది. గతంలో గుమ్మడిదలలో ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ కూడా లేని పరిస్థితి ఉండేది. చిన్నచిన్న సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాల కోసం ప్రజలు ఇతర ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉండేవి. అనంతరం గుమ్మడిదల అభివృద్ధి చెందడంతో ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటైంది. తొలినాళ్లలో ఎస్సై స్థాయి అధికారితో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలు, కేసుల దర్యాప్తు, ప్రజల ఫిర్యాదుల స్వీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహించేవారు.

**పెరుగుతున్న ప్రాధాన్యానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థలో మార్పులు**

గుమ్మడిదల మండలంతో పాటు మున్సిపాలిటీగా ఏర్పడటం, పరిధిలోని గ్రామాలు పట్టణీకరణ వైపు పయనించడం, పారిశ్రామిక ప్రాంతం విస్తరించడం, ప్రధాన రహదారులపై రాకపోకలు పెరగడంతో పోలీస్ శాఖపై బాధ్యతలు కూడా గణనీయంగా పెరిగాయి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రత, నేరాల నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో పోలీసుల పాత్ర మరింత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో గుమ్మడిదల పోలీస్ స్టేషన్ స్థాయిని ఎస్సై స్థాయి నుంచి సీఐ స్థాయికి పెంచడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఇప్పటివరకు ఎస్సై స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగిన స్టేషన్ వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుతం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ సీఐ స్థాయి అధికారితో నిర్వహించే స్థాయికి చేరుకోవడం ప్రాంతం అభివృద్ధికి మరో సూచికగా స్థానికులు భావిస్తున్నారు.

**ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు**

ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభోత్సవానికి అందుబాటులో సిద్ధంగా ఉంది. పోలీస్ సిబ్బందికి మెరుగైన పని వాతావరణం ఏర్పడటంతో పాటు ప్రజలకు కూడా పోలీస్ సేవలు మరింత సులభంగా అఉంది. పోలీస్ స్టేషన్ స్థాయి పెరగడంతో పరిధిలో శాంతిభద్రతల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఒకప్పుడు పోలీస్ స్టేషన్ కూడా లేని గుమ్మడిదల నేడు ఆధునిక పోలీస్ స్టేషన్‌తో పాటు సీఐ స్థాయి వరకు ఎదగడం వెనుక ప్రాంతం సాధించిన సామాజిక, ఆర్థిక, పరిపాలనా ప్రగతి స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామస్థాయి నుంచి మండల కేంద్రంగా, అక్కడి నుంచి మున్సిపాలిటీగా ఎదిగిన గుమ్మడిదల ప్రస్థానంలో పోలీస్ స్టేషన్ స్థాయి పెంపు మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

# కాకా సేవలు చిరస్మరణీయం..





- ప్రజాసేవే కాకా జీవిత ధ్యేయం..
- నాలుగుసార్లు ఎంపీగా..కేంద్ర మంత్రిగా సేవలు..
- తెలంగాణ అభివృద్ధిలో కాకా చెరగని ముద్ర..
- కాకా బాటలో నడవడమే నిజమైన నివాళి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి**
**అక్టోబర్ 5 (సిరి న్యూస్)**

తెలంగాణ ప్రజల హక్కుల కోసం, పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన దివంగత నేత, మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి, కాకా సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కాంగ్రెస్ నాయకుడు మంతెన జగన్మోహన్ రావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన కాకా రాజకీయ ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. కాకా 97వ జయంతిని పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి జగన్మోహన్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కాకా సేవలను స్మరించుకున్నారు..

**ప్రజాసేవకే అంకితం..**

ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ, సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో కాకా తన రాజకీయ జీవితాన్ని పూర్తిగా ప్రజాసేవకు అంకితం చేశారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం గళమెత్తిన ఆయన, పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు..

**నాలుగుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి..**

నాలుగుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన వెంకటస్వామి తెలంగాణ అభివృద్ధిపై తనదైన ముద్ర వేశారని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం విషయంలో కాకా చూపిన చొరవ, ప్రజలతో ఆయనకున్న అనుబంధం, సమస్యల పరిష్కారం కోసం చేసిన నిరంతర కృషి రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. పదవులు కాకాకు లక్ష్యం కాదని, ప్రజలకు సేవ చేయడమే ఆయన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు..

**నివాళి అంటే స్మరణ కాదు, ఆయన బాటలో నడవడమే..**

కాకాను గుర్తుచేసుకోవడంతో సరిపెట్టకుండా, ఆయన చూపిన ప్రజాసేవా మార్గాన్ని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని జగన్మోహన్ రావు అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాజిక న్యాయం కోసం నిలబడిన కాకా వంటి నాయకుల సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై వారి కష్టాలను తెలుసుకుంటూ, సామాన్యుల గొంతుకగా నిలిచే నాయకత్వమే ప్రజాస్వామ్యానికి బలమని ఆయన పేర్కొన్నారు. కాకా రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో వెంకటస్వామికి ప్రత్యేక స్థానం ఉందని, ఆయన జయంతి వేడుకలు ఆ సేవలను మరోసారి గుర్తుచేసే సందర్భంగా నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# తూప్రాన్ మండల స్థాయి గురుపూజోత్సవం



**తూప్రాన్ అక్టోబర్ 05 సిరి న్యూస్**

తూప్రాన్ మండల స్థాయి ఉపాధ్యాయులు సోమవారం అక్టోబర్ 5 తేదీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తూప్రాన్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్ లో మండల విద్యాధికారి డా. పార్వతి సత్యనారాయణ అధ్యక్షతన మండల స్థాయి గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారి అంకితభావం, సేవలను కొనియాడుతూ ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశి రెడ్డి హజరై అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ నేర్పేది గురువులేనని, అటువంటి గురువులను గౌరవించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందని, నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారి అంకితభావం, సేవలనుఆమె కొనియాడరు .ఈ కార్యక్రమం వివిధ గ్రామాల సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల మున్సిపాలిటీ బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

- పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు

**గుమ్మడిదల, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నూతన మున్సిపల్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. బిజెపి పార్టీ మున్సిపల్ అధ్యక్షులు నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపల్ ఇన్‌చార్జి కె. లక్ష్మణ్ గుప్తా, కౌన్సిలర్ గిద్దె విజయలక్ష్మి సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా మందకృష్ణారెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, మద్ది జైపాల్ రెడ్డి, కనకరాజు, చింతల కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా బుచ్చగారి రాంరెడ్డి, గొల్లన విజయ్ కుమార్, కోశాధికారిగా రాళ్లమడుగు కిషోర్, కార్యదర్శులుగా తుల్జాపురం రాజు, బాగయ్యలను నియమించారు. యువమోర్చా అధ్యక్షుడిగా సరెడ్డిగారి సుజల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి. సాయి నేత, ప్రధాన కార్యదర్శిగా విజయ్ కుమార్, కార్యదర్శిగా సాయి గుప్తా ఎన్నుకున్నారు. మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సారసుజనా లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అనిత నియమించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా శివరాత్రి రాజును, ప్రధాన కార్యదర్శిగా రాళ్లమడుగు గణేష్‌ను ఎన్నుకున్నారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బోయిపల్లి పెంటారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ ముదిరాజ్‌ను నియమించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

# భారత్ ఎటునుంచైనా దాడి చేయగలదు

**భారత్ :**

భారతదేశ అణు సామర్థ్యం, రక్షణ శక్తిపై అంతర్జాతీయంగా మరో కీలక నివేదిక వెలువడింది. భారత్‌వద్ద ప్రస్తుతం 190 అణ్వాయుధాలున్నాయని, శత్రు దేశాల గుండెల్లో నిద్రపోయేలా సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలను నిరంతరం ఆధునీకరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్ వెల్లడించింది. ముందుగా అణు దాడి చేయం అనే సూత్రానికి కట్టుబడి ఉంటూనే శత్రువులు దాడికి పాల్పడితే కోలుకోలేని దెబ్బతీసే రీతిలో భూమి, ఆకాశం, సముద్ర మార్గాల్లో న్యూక్లియర్ ట్రయాడ్‌ను భారత్ సిద్ధంగా ఉంచుకుంది. భారత్ తనవద్ద ఉన్న అణ్వాయుధ సంపత్తిని, క్షిపణి పరిధిని అధికారికంగా ఎప్పుడూ బహిర్గతం చేయదు. అయినప్పటికీ భారత్ వద్ద దాదాపు 190 అణ్వాయుధాలు ఉండే అవకాశం ఉందని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇతర దేశాల సహాయం లేకుండా స్వదేశీ సాంకేతికతతో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులు భారత్‌కు బలమైన రక్షణ కవచంగా మారాయని పేర్కొంటున్నారు.

# అభివృద్ధి సంక్షేమం .. కాంగ్రెస్ తోనే సాధ్యం ..

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు
- కోనాపూర్ గ్రామంలో రేషన్ కార్డులో పంపిణీ.

**రామాయంపేట, అక్టోబర్ 5 (సిరి న్యూస్)**

అభివృద్ధి సంక్షేమ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు సోమవారం రామాయంపేట మండలంలోని కోనాపూర్‌లో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 16 రేషన్ షాపులకు మొత్తం 13,513 రేషన్ కార్డులు మంజూరు కాగా, 15 గ్రామపంచాయతీల పరిధిలోని 9,739 కార్డులను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 10 లక్షలతో కోనాపూర్‌లో నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగాలని ఆయన సూచించారు. మహిళల సమగ్రాభివృద్ధికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో కోనాపూర్ గ్రామాన్ని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే గ్రామంలో మహిళా సంఘ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాజీలోద్దీన్ తాసిల్దార్ రజనీకుమారి మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కోనాపూర్ గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.